క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డిలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఊరేగించారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులతో దాత మధుసూదన్‌రావు

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు లైబ్రరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మధుసూదనరావు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. క్రీడాకారులకు చేయూతనిచ్చిన దాతను హెచ్‌ఎం నారాయణ అభినందించారు. కార్యక్రమంలో పీడీ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి



ఎంపీడీఓ రఘునాథ్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామరైతులు

కర్నూలు(రూరల్) : జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని నందనపపల్లె రైతులు కోరారు. ఈ మేరకు సోమవారం రైతులు బిచపల్లి, బీకే శ్రీనువాసులు తదితరులు కర్నూలు ఎంపీడీఓ రఘునాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నందనపల్లెలో ఉపాధి పనులు ఉండడంతో కూలీల కొరత ఏర్పడిందని, దీంతో వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఉన్నత అధికారులు సమస్యను గుర్తించి ఉపాధి పనులను వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలి, లేని పక్షంలో మార్చి వరకు ఉపాధి పనులు నిర్వహించకూడదని కోరారు. కార్యక్రమంలో రైతులు రామక్రిష్ణ, దాసు, నారాయణ, నాగేశన్న, నాగరాజు, మహానందయ్య, శివారమప్ప, బుగ్గ రాయప్ప తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మైనారిటీ విద్యార్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ముస్లింలు, క్రైస్తవులు (బీసీ – సీ), సిక్కు, బౌద్ధులు, జైన్, పార్సీ తదితర సామాజిక వర్గాలకు చెందిన వారు ఉచిత కోచింగ్‌కు అర్హులన్నారు. ఈ కోచింగ్ అందించేందుకు అర్హత కలిగిన సంస్థలు, అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రముఖ ప్రైవేటు సంస్థలతో ఎంప్యానెల్ చేయడం ద్వారా ఉచిత శిక్షణను ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇందుకు జిల్లాలోని ఆసక్తి కలిగిన సంస్థలు, అభ్యర్థులు వెబ్‌సైట్ www.apcedmmwd.orf పోర్టల్ ద్వారా లేదా డైరెక్టర్ కార్యాలయం, మైనారిటీల విద్య అభివృద్ధి కేంద్రం, స్వాతి థియేటర్ ఎదురుగా, భవానీపురం, విజయవాడ 520012 చిరునామాకు ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 0866– 2970567 నంబర్ లేదా ఈ – మెయిల్ ఐడీ cedma p2017@fm-ai .com లో సంప్రదించాలన్నారు.

పూడికతీత పనులు ముమ్మరం చేయండి

కర్నూలు(టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని మురుగు కాల్వల్లో పూడికతీత పనులు ముమ్మరం చేయాలని కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు ఆదేశించారు. సోమవారం స్థానిక కృష్ణానగర్, బిర్లాకాంపౌండ్, సిల్వర్ జూబ్లీ కళాశాల ప్రాంతాల్లో కమిషనర్ విస్తృతంగా పర్యటించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీల్లో మురుగు నీరు ప్రవాహానికి ఆటంకం కలగకుండా పూడికతీత పనులను త్వరితగతిన చేపట్టాలన్నారు. పలు కాలనీల్లో కల్వర్టులు, మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. డీఈఈ మనోహర రెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఈ మనోహర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనిల్ పాల్గొన్నారు.

ఈ విద్యార్థిని పేరు ఆర్ సాయిప్రియ. లక్ష్మీపురం కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఇంటర్ చదువుతుంది. చిన్నపటి నుంచి క్రీడలంటే ఎంతో మక్కువ. కర్నూలులో ఎస్‌జీఎఫ్ అండర్–18 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి 100 మీటర్ల స్ప్రింట్ పరుగు పదెం పోటీలలో రెండవ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జార్ఖండ్ రాష్ట్రంలో జనవరిలో జరుగనున్న జాతీయ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధం అవుతోంది. గతేడాది నిర్వహించిన అథ్లెటిక్ పోటీలలో 100 మీటర్ల స్ప్రింట్‌లో జాతీయ పోటీలో ఆడిన అనుభవంతో విజయం సాధిస్తానంటుంది సాయిప్రియ. గురువుల సహకారంతో భవిష్యత్తులో ఒలంపిక్స్‌లో ఆడడమే తన లక్ష్యమని చెబుతుంది.



లక్ష్మీపురం కస్తూర్బా బాలికల విద్యాలయంలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని పేరు కే పూజిత. అండర్–14 విభాగం రగ్బీలో మొదటి స్థానంలో నిలిచారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ంది. త్వరలో జరగనున్న జాతీయ స్థాయిలో పోటీల్లోనూ సత్తా చాటేందుకు సిద్ధం అవుతుంది. జాతీయ స్థాయిలో పతకం సాధించి అంతర్జాతీయ స్థాయిలో రాణించడమే తన లక్ష్యం అంటుంది పూజిత. క్రీడల్లో ప్రతిభ చాటి గురువులతోపాటు విద్యాలయానికి పేరుతెస్తానని ధీమా వ్యక్తం చేస్తుంది.



‘కస్తూర్బా’... క్రీడా ప్రతిభ !

- స్ప్రింట్, రగ్బీ క్రీడల్లో రాణిస్తున్న లక్ష్మీపురం కేజీబీవీ విద్యార్థినులు
- జనవరిలో జాతీయ స్థాయి పోటీల్లో తలపడనున్న బాలికలు



చెస్ ఆడుతున్న విద్యార్థినులు (ఫైల్)



పరుగు పందెంలో పోటీ పడుతున్న విద్యార్థిని సాయిప్రియ (ఫైల్)

కల్లూరు: బాలికలు సైతం క్రీడల్లో తమ ప్రతిభ చాటుతున్నారు. చదువులోనేకాదు క్రీడాల్లో రాణిస్తూ బాలురకు తాము ఏ విషయంలోనూ తీసుపోమంటూ సత్తా చాటుకుంటున్నారు. ఇందుకు కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థినులు ఓ ఉదాహరణ. ఎస్ఎఫ్‌జి క్రీడాల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలోనూ దూసుకెళ్తున్నారు. ఖోఖో, చెస్, రగ్బీ, పరుగు తదితర క్రీడల్లో రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. విజయాలను సొంతం చేసుకుంటున్నారు కూడా. లక్ష్మిపురం కస్తూర్బా విద్యార్థిని ఆర్. సాయిప్రియ అండర్–18 విభాగంలో 100 మీటర్ల స్ప్రింక్ విభాగంలో రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక అయ్యింది. 2025 జనవరి 4, 5, 6, 7 తేదీలలో జార్ఖండ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు సిద్ధం అవుతుంది సాయిప్రియ. అదేవిధంగా కె.పూజిత అండర్–14 విభాగంలో రగ్బీ ఆటల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు సిద్ధం అవుతుంది. వీరితోపాటు పలువురు విద్యార్థినులు క్రీడాల్లో సత్తా చాటుతున్నారు. చెస్‌లో మంజుల లక్ష్మి ఏపీ ఓపెన్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయిలో రెండవస్థానం సాధించింది. వి శాంతి జిల్లాస్థాయి చెస్‌పోటీలో నాల్గవస్థానం, జనని, ఉషాకుమారి జిల్లాస్థాయి చెస్‌పోటీల్లో ప్రతిభచాటారు. కస్తూర్బా విద్యార్థినులు క్రీడల్లో ప్రతిభ చాటుతూ అందరి మన్ననలు పొందుతున్నారు.

పంటకోత ప్రయోగాలతో అనేక లాభాలు



కొరటమద్దిలో పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: పంట కోత ప్రయోగాల ద్వారా అనేక లాభాలు ఉన్నాయని, ఒక గ్రామంలోని నాలుగు ప్రయోగాలలో వచ్చిన దిగుబడుల సరాసరి ఆధారంగా పంట బీమాను ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో సోమవారం వరి పంటలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఏఓ ఆధ్వర్యంలో రైతు రాఘవరెడ్డి, ఆజాం, సురేష్ పొలంలో పంట కోత ప్రయోగం చేయగా 19.67 కేజీల దిగుబడి వచ్చింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో అన్ని గ్రామాలలో వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని ఏఓ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

గడివేముల: రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని, రైతులు ఆందోళన చెందాల్సి అవసరం లేదని తహసీల్దార్ వెంకటరమణ తెలిపారు. మండల పరిధిలోని ఏడు గ్రామాల్లో రీసర్వేలో జాయింట్ ఎల్‌పీలు ఉంటే పరిష్కరిస్తామన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీలు, కొలతల్లో వ్యత్యాసం ఉన్న రైతులు ఎటువంటి చలానా రుసుము చెల్లించనవసరం లేకుండానే పరిష్కరిస్తామని చెప్పారు. ఎవరైనా నగదు డిమాండ్ చేస్తే అటువంటి వారిపై చర్యలు తీసుకుకుంటామన్నారు.

ప్రజా వినతులకు పరిష్కారం చూపండి

ఓర్వకల్లు: ప్రజల వినతులకు సత్వర పరిష్కారం చూపాలని ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్ కల్యాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను ఆమె స్వీకరించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణలో భాగంగా మూడు వారాల పాటు తాను ఇక్కడే ఉంటానన్నారు. భూముల ఆన్‌లైన్, డాటెడ్ ల్యాండ్, స్థలం రస్తాలపై ఎనిమిది వినతులు వచ్చినట్లు తెలిపారు.



వినతి పత్రం స్వీకరిస్తున్న ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి

అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 45 రోజుల్లో పరిష్కారం చూపుతారని ఆమె తెలిపారు.

ఉపాధి పనుల తనిఖీపై గ్రామ సభలు

సి.బెళగల్: మండలంలోని ఇనగండ్ల, ముడుమాల గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోమవారం డీఆర్‌పీలు గ్రామ సభలు నిర్వహించారు. ఇనగండ్ల రచ్చకట్ట దగ్గర ఏర్పాటు చేసిన గ్రామసభలో నివేదికలను డీఆర్‌పీ హేమంత్ గ్రామస్తులకు చదివి వినిపించారు. గ్రామంలో 66 పనులు చేపట్టగా, రైతులు నాటుకున్న ఉద్యాన పంటలు ఎండిపోవడం, ఆరు పనులకు నామ పలకలు (నేమ్ బోర్డులు) లేకపోవడం, మస్టర్లలో తేడాలను గర్తించినట్లు డీఆర్‌పీ తెలిపారు. అదేవిధంగా ముడుమాల గ్రామంలో జరిగిన 50 పనులపై తనిఖీలు నిర్వహించిన డీఆర్‌పీ రాములు కొలతలలో తేడాలు, మస్టర్ల సమస్యలను గుర్తించినట్లు సభకు తెలిపారు.



ఇనగండ్లలో గ్రామసభ నిర్వహిస్తున్న డీఆర్‌పీ నాగరాజు

కార్యక్రమంలో ఏపీఓ రామన్న, ఈసీ పృధ్విరాజ్, స్వతంత్ర పరిశీలకులు, ఎంఈఓ – 2 ఆదామ్‌బాషా, టీఏలు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు

కల్లూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల విద్యార్థులు క్రీడాల్లో ప్రతిభ చాటారు. గురుకులాల అంతర్ పాఠశాలల రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను పశ్చిమగోదావి జిల్లా పెదవేగిలో నవంబర్ 28 నుంచి డిసెంబంర్ 1 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నటేకూరు గురుకుల కళాశాల విద్యార్థులు ఖోఖో క్రీడలో విజయం సాధించారు. అలాగే లాంగ్‌జంప్‌లో రెండవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ మహానంది, ఐఐటీ, మెడికల్ అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు, పీడీ చంద్రశేఖర్, పీఈటీ కిరణ్‌కుమార్ విద్యార్థులను అభినందించారు. చిన్నటేకూరు గురుకుల కళాశాలకు ఉలిందకొండ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, డైరెక్టర్, అధ్యాపకులు

ఎస్ ధనుంజయ సోమవారం విద్యార్థుల క్రీడాలకు వాలీబాల్స్, బాస్కెట్ బాల్స్ ఉచితంగా అందజేశారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగాలని, కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు.

కూటమి పాలనలో పేదలకు వాత

- ప్రజలపై విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారం
- గ్యాస్ సబ్సిడీ హోర్డింగ్‌లే తప్పా రాయితీ జమ చేయడం లేదు
- డీఎస్సీ సంతకంతో కోచింగ్ సెంటర్లకు పండుగ
- సీపీఎం మహాసభల్లో కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(సెంట్రల్): కూటమి పాలనలో వంట నూనెల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దతుతో నడుస్తున్నా రాష్ట్రానికి న్యాయం జరగడం లేదన్నారు. కనీసం 10 వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమను కర్నూలులో ఏర్పాటు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. రెండు రోజులుగా జరుగుతున్న కర్నూలు న్యూసిటీ నగర కమిటీ మూడో మహాసభలు సోమవారం ముగిశాయి. సాయంత్రం నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పార్లమెంట్‌లో ఆదానీపై చర్చ జరగకుండా అడ్డుకుంటున్నారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. కూటమి సర్కార్‌లో పేదలకు వాతలే వాతలు పెడుతున్నారని విమర్శించారు. విద్యుత్ ట్రూఅప్ చార్జీల భారం వేశారన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుకు అయ్యే ఖర్చు కంటే ప్రచార హోర్డింగ్‌లకే ప్రభుత్వం ఎక్కువగా ఖర్చు చేస్తోందన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ అయ్యి 10 రోజులు గడిచినా సబ్సిడీ జమ కావడం లేదన్నారు. డీఎస్సీపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకం చేయడంతో కోచింగ్ సెంటర్లకు పెద్ద పండగ వచ్చిందన్నారు. అభ్యర్థులు చిన్న చిన్న ఉద్యోగాలు మానుకుని, అప్పులు చేసి కోచింగ్‌కు చేరడంతో వారి ఖజానా డబ్బులతో గలగలలాడుతోందన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా దొరకుతుండడంతో విద్యార్థులు వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, వర్గ సభ్యులు పి.నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు అరుణ, అలివేలు, నగేష్, సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సీపీఎం న్యూసిటీ నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా టి.రాముడు, నగర కార్యవర్గ సభ్యులుగా ఆర్.నరసింహులు, సీహెచ్.సాయిబాబా, కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, కె.అరుణ, మరికొందరు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సూపరింటెండెంట్ తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): చలిగాలులతో ఆసుపత్రిలో రాత్రివేళ ఇబ్బంది పడే రోగుల సహాయకులకు ఎదురుగా ఉన్న శాలమ్మ సత్రంలో విశ్రాంతి తీసుకునే విధంగా ఏర్పాట్లు చేస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం రాత్రి ఆయన ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ విభాగంలో డీఏపీ, డీఏఎస్ డ్యూటీ అసిస్టెంట్ల గురించి ఆరా తీశారు. రౌండ్స్ నిర్వహించే సమయంలో డీఏఎస్ (అసిస్టెంట్ సర్జన్) లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు డాక్టర్‌ను వెంటనే పిలిపించి అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్‌ను ఆదేశించారు. క్యాజువాలిటీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని చెప్పారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో పేషంట్, అటెండర్స్ నిద్రిస్తున్న విషయాన్ని ఆరా తీశారు. రోగుల సహాయకులు ఎక్కడపడితే అక్కడ నిద్రించకుండా శాలమ్మ సత్రంలో నిద్రించే విధంగా చూసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశించారు.

సూపర్ సిక్స్ అమలు చేయలేక అసత్య ఆరోపణలు

- తప్పుడు కేసులతో వేధిస్తే కూటమి పునాదులు పెకిలిస్తాం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): తప్పుడు కేసులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఇబ్బంది పెట్టాలని చూస్తే ప్రజా ఉద్యమంతో కూటమి పునాదులు పెకిలిస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక సి.క్యాంపులోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడం చేతకాక ప్రజలను డైవర్ట్ చేసేందుకు జగనన్నపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు రాజకీయ కక్షలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలపై ప్రజల దృష్టి మరల్చేందుకు జగనన్నపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్న విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, త్వరలోనే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కూటమి పార్టీలు హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టపరంగా కేసులు పెట్టవచ్చని, అక్రమ కేసులతో వేధిస్తే ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి గుణపాఠం చెబుతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, ఉన్నత వర్గాల్లోని పేదలందరూ జగనన్న పాలనను గుర్తుకు చేసుకుంటున్నారని చెప్పారు.

ఇరుకు బ్రిడ్జీలు .. ప్రమాదాల కేంద్రాలు!

- వాహనదారులకు దడ పుట్టిస్తున్న హైవేపై ప్రయాణం
- రోడ్డుపై కనిపించని ఎత్తుపల్లాలు
- ప్రమాదాలకు అడ్డగా మారిన అడ్డవాగు
- రెండు రోజుల్లో 8మందికి గాయాలు



తమ్మరాజుపల్లె వద్ద జులేపాయ వాగుపై ఇరకుగా ఉన్న బ్రిడ్జి

పాణ్యం: కర్నూలు–కడప జాతీయ రహదారి అధ్వానంగా మారింది. కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రయాణం సాఫీగా సాగడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 130 కిలోమీటర్ల మేర ఉన్న ఈ హైవే రహదారిపై కనిపంచని ఎత్తుపల్లాలతో వాహనదారులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఇరుకైన వంతెనలు, దగ్గరకు వస్తే గాని కనిపించని గోతులు, మలుపుల మూలంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రత్యేకించి చిన్న వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాణ్యం మండలంలో అత్యధికంగా రోడ్డు ప్రమాదలు జరిగే ప్రదేశాల్లో ఎస్ టర్నింగ్ ఒకటి. ఈ మలుపు వద్ద రెండు రోడ్లపై బ్రిడ్జిలు చిన్నవిగా ఉన్నాయి. దీంతో మరో వాహనన్ని దాటేందుకు ప్రయత్నిస్తే అంతే సంగతి. ప్రత్యేకించి కుంట వైపు (ఎడమ)కల్వర్టు ఏకంగా ముందుకు వచ్చింది. దీంతో వాహన దారులు ఏ మాత్రం గమనించకపోయినా ప్రమాదానికి గురికాక తప్పదు. ఈ ప్రాంతం వచ్చేసరికి వాహనచోదకులు భయపడుతున్నారు.

ప్రమదాల అడ్డ.. ‘అడ్డవాగు’

హైవే విస్తరించకముందు నుంచే అడ్డవాగు ప్రమదాలకు అడ్డగా మారింది. ఇక్కడ గత పదేళ్లలో తొమ్మిది మంది మృతి చెందారు. చాలా మంది గాయాలపాలయ్యారు. అడ్డవాగును హైవే అధికారులు విస్తరించకపోవడమే నేటికి ప్రమాదాలకు అడ్డగా మారిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఆది, సోమ వారాల్లో ఈ వాగుపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది గాయపడ్డారు. ఓ వాహనం వాగులో పడింది. బ్రిడ్జిపై కేవలం ఒక వాహనం వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ముందు వెళ్లే వాహనాన్ని దాటేందుకు చేసేప్రయత్నంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఢీకొన్నప్పుడు మాత్రం అధికారులు కల్వర్టులకు మర్మతులు చేయిస్తున్నారే తప్పా విస్తరించాలనే ఆలోచనే రావడం లేదని వాహనచోదుకులు వాపోతున్నారు. తమ్మరాజుల్లె గ్రామం దాటాక కుడివైపు (కర్నూలు–నంద్యాల)వచ్చే క్రమంలో జులేపాయ వాగు కూడా చాలా ఇరుకుగా ఉంది. కల్వర్టును ఢీకొని ప్రమాదాల బారీన పడుతుంటారు వాహనచోదకులు. దెబ్బతిన్న కల్వర్టుకు మరమ్మతులు చేయించడం తప్పా బ్రిడ్జిని వెడల్పు చేయడం లేదు. ఈ అధికారుల తీరును తప్పుపడుతున్నారు తమ్మరాజుల్లె గ్రామస్తులు, ప్రయాణికులు.



అడ్డవాగుపై ఇరుకుగా ఉన్న బ్రిడ్జి



ఎస్ టర్నింగ్ వద్ద కుంచించుకుపోయిన సైడ్‌వాల్



సుగాలిమెట్ట వద్ద గాలేరు కాల్వ వైపు దెబ్బతిన్న రోడ్డు

కళాశాలల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని నర్సింగ్ కళాశాలల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్–నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయుడు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సింగ్ కళాశాలలు ఫీజుల దందాకు పాల్పడుతూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కౌన్సెలింగ్ జరగకుండానే అడ్మిషన్ల పేరుతో అక్రమంగా వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించిన వారిపై ప్రాక్టికల్స్, ఎక్స్‌టర్నల్, ఇంటర్నల్ మార్కుల విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఆయా కళాశాలల అక్రమాలపై విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): డిసెంబర్ 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.జగన్నాథం, ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో కర్నూలు నగర సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీపీఐ ఆవిర్భవించి 100వ సంవత్సరంలోకి అడుగు పెట్టనున్న నేపథ్యంలో ఏడాది పాటు శత వార్షికోత్సవాలను నిర్వహించేందుకు పార్టీ నిర్ణయించినట్లు చెప్పారు. అందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. నాయకులు చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు, నాగరాజు, అన్వర్, కుమార్, సోమన్న, గిడ్డమ్మ పాల్గొన్నారు.